చిత్తూరులో ఓటు హక్కు వినియోగించుకున్న కుటుంబం









తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న ఆనందంలో యువ ఓటర్లు

క్లుప్తంగా

రెండోసారి జగన్ సీఎం అవుతారు

సదుం: రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. ఎర్రాతివారిపల్లెలో మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించనున్నట్లు తెలిపారు. దేవుని దయ, ప్రజల ఆశీస్సులతో జగన్ సీఎం అవుతారన్నారు. ఎన్ని శ దుష్టశక్తులు అడ్డుకున్నా..దేవుని దయ..ప్రజల ఆశీస్సులు ఉండడంతో దీనిని ఎవరూ అడ్డుకోలేరన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

చోరీకి యత్నించిన యువకులను చితకబాదారు

కుప్పం రూరల్: చోరీకి యత్నించిన బిహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులను గ్రామస్తులు చితకబాది పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం కుప్పం మండలం దళవాయికొత్తపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన ముని కుటుంబ సమేతంగా ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లడంతో ఇంట్లో వికలాంగుడైన ముని అన్న మాత్రమే ఉన్నాడు. దీనిని గమనించిన సుమన్, విభూషణ్ అనే ఇద్దరు బిహారీ యువకులు ముని ఇంట్లో ప్రవేశించి దొంగతనానికి యత్నించారు. ఇంతలో ముని అన్న కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ఆ యువకులను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్డీఓ



ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి

గంగవరం: పలమనేరు ఆర్డీవో, ఆర్వో మనోజ్‌కుమార్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలమనేరు ఆర్డీవోగా ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కుటుంబంతో సహా గంగవరం సాయిగార్డెన్ సిటీలో నివాసం ఉంటున్నారు. దీంతో ఆయన స్వస్థలం రాయచోటి నుంచి ఓటును ఇక్కడికి బదిలీ చేసుకున్నారు. గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ సరళిని పరిశీలించిన ఆయన అక్కడే 88వ పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.

చిత్తూరులో పోటెత్తిన ఓటర్లు!







ఓటేయడానికి వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి వస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

- ఉదయం నుంచే క్యూలలో బారులు తీరిన ప్రజలు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు, పోలింగ్ ఆలస్యం
- దొంగ ఓట్లు, దౌర్జన్యాలపైనే టీడీపీ ఫోకస్.. అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ
- చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- నియోజకవర్గంలో 80.65 శాతం పోలింగ్ నమోదు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో గుడిపాల మినహా.. మిగిలిన అన్ని చోట్ల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పలుచోట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులకు దిగాయి. దొంగ ఓట్లు వేయడం, దౌర్జన్యాలు చేయడంపైనే టీడీపీ నేతలు దృష్టి సారించారు. నియోజకవర్గంలో పోలింగ్ 80 శాతంగా నమోదైంది. చిత్తూరు నియోజకవర్గంలో చోటు చేసుకున్న ప్రధాన ఘటనలు పరిశీలిస్తే..

- నగరంలోని గాండ్లపల్లె పోలింగ్ కేంద్రంలో ఉదయం 9 గంటలకు కూడా పోలింగ్ ప్రారంభం కాలేదు. ఇక్కడి ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలలో వేచి ఉండాల్సి వచ్చింది. లక్ష్మీనగర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాల పోలింగ్ కేంద్రంలో మూడు ఈవీఎంలు మొరాయించడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేశారు. ఫలితంగా ఇక్కడ కూడా పోలింగ్ ఆలస్యంగా మొదలైంది.
- చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు విజయానంద రెడ్డి, గురజాల జగన్మోహన్ నాయుడు బాపుబాలవన్ పోలింగ్ కేంద్రంలో, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు షర్మన్ పాఠశాలలో, మునిసిపల్ కమిషనర్ అరుణ గాండ్లపల్లె కార్పొరేషన్ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. పోలింగ్ కేంద్రం సమీపంలోనే రోడ్డుకు అడ్డుగా టెంట్ వేసిన టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన పచ్చ కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల చొక్కా చింపి దాడికి పాల్పడ్డారు.



పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో సాధారణ ఓటరులా నిరీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

- చిత్తూరు రూరల్ మండలంలోని ముట్టుకూరులో పోలింగ్ ముగిశాక.. అధికారులు ఇచ్చిన రబ్బర్‌స్టాంపుతో సీల్ వేయాల్సి ఉంది. అయితే ఇక్కడున్న టీడీపీ ఏజెంట్లు ఆ పార్టీ అభ్యర్థి పేరిట ఉన్న జీజేఎం రబ్బర్‌స్టాంపుతో సీలు వేశారు. దీన్ని అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రశ్నించడంతో తోపులాట జరిగింది. అనంతరం జీజేఎం సీలును తొలగించి, ముందుగా ఇచ్చిన రబ్బరుస్టాంపుతో సీలు వేశారు. వీఎస్.పురం పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు దిగారు. పోలింగ్ జరుగుతుండగానే బయట ఉన్న టీడీపీ కార్యకర్తలు లోపలకు రావడాన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపై దాడికి యత్నించారు.


నియోజకవర్గంలో పోలింగ్ నమోదు ఇలా..

సమయం		పోలింగ్ శాతం
ఉ.11 గం.	:	29.07
మధ్యాహ్నం 1 గం.	:	48.26
మ.3 గం.	:	64.33
సాయంత్రం 5 గం.	:	74.75
రాత్రి 10 గం	:	80.65

- చిత్తూరు నగరంలోని మిట్టూరులో టీడీపీ నేత సీకే.బాబు పలువురు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను బెదిరించారనే విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి వెళ్లి అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రం నుంచి సీకే బాబును బయటకు పంపాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద, ఆ బూత్‌కు సంబంధం లేని వ్యక్తులు ఓట్లు వేయడానికి ప్రయత్నించడంతో విజయానందరెడ్డి అడ్డుకున్నారు.
- చిత్తూరులోని కొంగారెడ్డిపల్లె నాయిబ్రాహ్మణ కాలనీలో స్థానిక టీడీపీ నాయకుడు శేషాద్రినాయుడు పోలింగ్ ముగుస్తున్న సమయంలో దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నించాడు. అక్కడకు చేరుకున్న విజయానందరెడ్డి, శేషాద్రినాయుడును ఈడ్చిపడేశారు. లక్ష్మీనగర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో 15 ఏళ్లు కూడా నిండని యువతులతో టీడీపీ ఏజెంటు రమణ దొంగ ఓట్లు వేయించాడు. కొద్దిసేపు తరువాత మళ్లీ పది మందిని దొంగ ఓట్లు వేయడానికి తీసుకొస్తుండగా డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత కుమార్‌స్వామి రెడ్డి అడ్డుకున్నారు.
- నగరంలోని ఓబనపల్లెలో సాయంత్రం 5 గంటల సమయంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు దొంగ ఓట్లు వేయడానికి క్యూ కట్టారు. అడ్డు చెప్పిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడికి ప్రయత్నించగా ఇరువర్గాలు తోపులాడుకున్నారు.

ఓటెత్తిన జనం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు డివిజన్లలో ఓటర్లు అధిక సంఖ్యలో బారులు తీరి ఓటు వేశారు. కొన్ని బూత్‌లలో ఉదయం 7 గంటలకు ఈవీఎంలు కాసేపు మొరాయించినా తర్వాత పనిచేశాయి. ఉదయం నుంచి ఓటర్లు క్యూలల్లో బారులు తీరారు. పలుప్రాంతాల్లో యువత తొలిసారి ఓటు వేశారు. కట్టమంచి బూత్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న హితిష్, తేనబండ, దుర్గానగర్ కాలనీ బూత్‌ల్లో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి, పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గాయత్రీదేవి ఓటు హక్కును వినియోగించుకున్నారు. టెలిఫోన్‌కాలనీ బూత్‌లో అధిక సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. నాయిబ్రాహ్మణ కాలనీ బూత్‌లో రద్దీ కనిపించారు.



ఓటు వేస్తున్న విజయానందరెడ్డి




ఓటేసిన కమిషనర్ అరుణ



ఓటేసిన గాయత్రీదేవి



ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి









చిత్తూరు: షెర్మన్ బాలికోన్నత పాఠశాలలో క్యూలో ఉన్న ఓటర్లు, నాయీ బ్రాహ్మణ కాలనీలో పోటెత్తిన ఓటర్లు, చిత్తూరులోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు కార్డు చూపుతున్న మహిళా ఓటర్లు, ఓటు వేయడానికి క్యూలో నిరీక్షిస్తున్న ఓటర్లు



ఓటు వేయాల్సిందే!

చిత్తూరు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉదయం 7 గంటల కంటే ముందుగానే వచ్చి బారులు తీరారు. కొన్ని చోట్ల క్యూలోనే మూడు గంటలపాటు ఎంతో ఓపికగా నిరీక్షించి ఓటు వేసి వెళ్లడం గమనార్హం. ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో మార్పు కొట్టొచ్చినట్లు కనబడింది.

–చిత్తూరు కార్పొరేషన్





జీడీనెల్లూరులో టీడీపీ నీచరాజకీయం

- చెదురుమదురు ఘటనలు మినహా అంతటా ప్రశాంతం
- ప్రైవేటు బౌన్సర్ల పేరిట రౌడీషీటర్లను దింపిన టీడీపీ అభ్యర్థి థామస్
- ఓటింగ్ నాడు కూడా స్క్రాచ్ కార్డు పేరిట ఓటర్లను మభ్య పెట్టిన వైనం
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులు తీరిన ఓటర్లు
- జీడీనెల్లూరులో బలంగా వీచిన ఫ్యాన్ గాలి

కార్వేటినగరం: నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం చెదురుమదురు ఘటనలతో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గస్థాయిలో 79.90 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నడూ లేని కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

శృతిమించిన టీడీపీ ఆగడాలు..

టీడీపీ అభ్యర్థి థామస్ చెన్నై నుంచి ప్రైవేటు బౌన్సర్ల ముసుగులో రౌడీషీటర్లను తీసుకొచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నూరులో పోలింగ్ బూత్ వద్దకు చేరుకుని మీరు ఎవరు ? ఎందుకు వచ్చారని నిలదీయడంతో టీడీపీ అభ్యర్థి థామస్ వాగ్వాదానికి దిగారు. దీనిపై మంత్రి స్పందిస్తూ చెన్నై నుంచి రౌడీషీటర్లను తీసుకొచ్చి ఓటర్లను ఇబ్బంది పెడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి చెదరగొట్టారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని లేనిపక్షంలో నిరసనకు దిగుతామని మంత్రి హెచ్చరించడంతో కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటకృష్ణ హామీ ఇచ్చారు. టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ ఓటింగ్ నాడు కూడా నీచరాజకీయాలకు తెరలేపారు. రూ.500 విలువ చేసే స్క్రాచ్ కార్డులు లాంటివి పంపిణీ చేస్తూ టీడీపీకి ఓటు వేస్తే మీ ఖాతాల్లో రూ.5 వేలు జమ అవుతాయని చెప్పి పంచారు.



టీడీపీ అభ్యర్థి థామస్ చెన్నై నుంచి తీసుకొచ్చిన రౌడీషీటర్లు

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి, కృపాలక్ష్మి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తమ స్వగ్రామం పాదిరికుప్పంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా జెడ్పీటీసీ పరంజ్యోతి కూడా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి, మాంబేడు, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అధిక సంఖ్యలో బారులు తీరడంతో 5 గంటల్లోపు క్యూలో ఉన్నవారు రాత్రి 9 గంటల వరకు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తహసీల్దార్ సుబ్బులక్ష్మమ్మ తెలిపారు. మండలంలో 17,827 ఓటర్లు ఉండగా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 83 శాతం ఓటింగ్ జరగ్గా, మొత్తం 14,643 ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ తెలిపారు. ఎస్‌ఐ భారతి గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ శ్యామల పాలసముద్రం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి వేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: చెదురుముదురు సంఘటనలు మినహా మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్‌కేంద్రాల వద్ద టీడీపీ నాయకులే హంగామాలు చేశారు. దేవళంపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెలే అభ్యర్థి కృపాలక్ష్మిపై టీడీపీ నాయకుల సతీష్ నాయుడు దాడికి ప్రయత్నించారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు అక్కడికి వెళ్లిన కృపాలక్ష్మిని అడ్డగించి కులం పేరుతో ధూషించడంతో ఆమె వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జక్కిదొన పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ టీడీపీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నా ప్రధాన రహదారిపై టీడీపీ నాయకులతో కలిసి ప్రచారం చేయడంతో స్థానికులు వ్యతిరేకించారు.

గంగాధర నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కర్ణాటక, తమిళనాడు ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. మండలంలో మహాదేవమంగళం పంచాయతీలోని పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులకు వచ్చిన అధికారులు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు రిటర్నింగ్ అధికారి వెంకటశివకు ఫిర్యాదు చేయగా వెంటనే ఆ సిబ్బందిని విధుల నుంచి తప్పించి, వేరే సిబ్బందితో పోలింగ్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు.



జీడీనెల్లూరులో క్యూలైన్‌లో బారులు తీరిన ఓటర్లు